ఆక్రమణ చెరలో మురుగు కాలువలు

ఏలూరు రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏలూరు రూరల్ మండలం జాలిపూడి, పోణంగి, వెంకటాపురం, మల్కాపురం, బాబూఖాన్‌గూడెం, చాటపర్రు, కోటేశ్వరదుర్గాపురంలో వందల ఎకరాలు చేలల్లో మురుగునీరు నిలిచిపోతోంది. దీనికి ప్రధాన కారణం విశాలమైన చేపల చెరువులు గట్లు. ఈ గట్లు కారణంగా మురుగు కాలువలు కుచించుకోయాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కాలువ ప్రక్షాళన చేశారని గుర్తు చేస్తున్నారు.

ప్రధాన సమస్యలు

పోణంగిలోని చేపల చెరువులు కారణంగా స్థానిక ఈన్పుకుంట మురుగుకాలువ కుచించుకుపోయింది. ఫలితంగా ఎగువన ఉన్న 100 ఎకరాల పంట చేలల్లో మురుగు కిందకు పారక ఏటా ముంపుబారిన పడుతున్నాయి. జాలిపూడి సత్యనారాయణ కోడు, కొండేపుంత కోడు కింద కొల్లేరు సమీపంలో వందల ఎకరాల చేపల చెరువులు ఉన్నాయి. ఈ ప్రాంతంలో మురుగుకాలువ కుచించుకుపోవడంతో ఎగువన ఉన్న 2 వేల ఎకరాల్లో మురుగునీరు కొల్లేరులోకి పారడం లేదు. కోటేశ్వరదుర్గాపురం దిగువన ఉన్న చేపల చెరువుల గట్లు అడ్డంకి కారణంతో వందల ఎకరాల చేలల్లో మురుగు రోజుల తరబడి నిలిచిపోతోంది.

మురుగుకాలువ ఆక్రమణ

మండలంలో సుమారు 6,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. కృష్ణా, గోదావరి కాలువ ఆయకట్టు కింద సాగు చేస్తున్న ఈ చేలల్లో మురుగునీరు మొత్తం కొల్లేరులోకి పారుతుంది. అయితే మురుగుకాలువ శివారు గ్రామాలైన జాలిపూడి, పోణంగి, కోటేశ్వరదుర్గాపురం, మాదేపల్లిలో వేల ఎకరాల్లో చేపల చెరువులు వెలిసిన సంగతి తెలిసిందే. ఈ చెరువుల యజమానులు మురుగుకాలువల మీద వందల సంఖ్యలో వంతెనలు, కల్వర్టులు నిర్మించారు. దీనివల్ల సుమారు 20 నుంచి 30 మీటర్ల వెడల్పు ఉండాల్సిన మురుగు కాలువలు 5 నుంచి 8 మీటర్లకు కుచించుకుపోయాయి. ఫలితంగా వర్షాకాలం, వరదల సమయంలో చేలల్లో మురుగు కిందకు వేగంగా పారడం లేదు. చేపల చెరువులు లేని సమయంలో చేలల్లో మురుగునీరు చేలమీదగా నేరుగా కొల్లేరులోనికి పారేది. ప్రస్తుతం నాలుగు పక్కల ఎత్తైన చెరువు గట్లు కారణంగా నేరుగా పంట భూముల మీదుగా పారడం లేదు. చెరువులు చుట్టూ తిరిగి పారుతోంది.

రెవెన్యూ అధికారులు పరివేక్షణ లోపం

మురుగు కాలువల అక్రమణలపై రెవెన్యూ అధికారులు ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. చేపల చెరువులు తవ్వే సమయంలో మురుగుకాలువ ఆక్రమణ కాకుండా పరివేక్షించడం లేదన్నారు. వాస్తవానికి చేపల సాగుదారులు సరిహద్దుకు కనీసం 3 నుంచి 6 మీటర్ల దూరంలో గట్లు వేసుకోవాలనే నిబంధన ఉందని గుర్తు చేస్తున్నారు. గతంలో చెరువులకు అనుమతి పొందిన సాగుదారులు సరిహద్దు వరకూ గట్లు వేశారని ఆరోపిస్తున్నారు. దీనికి తోడు కాలువల్లో చెత్త, చెదారం పేరుకుపోవడంతో చేలల్లో మురుగు వేగంగా కిందకు పారడం లేదన్నారు.



జాలిపూడి సమీపంలో మురుగునీరు దారి మళ్లిస్తున్న కూలీలు



మల్కాపురంలో సచివాలయ ఉద్యోగులు బాగు చేయించిన పొలిమేర కోడు కాలువ (ఫైల్)

అడ్డంకులు తొలిగిస్తాం



కొందరు చేపల చెరువుల యజమానులు మురుగు కాలువలపై తూరలు ఏర్పాటు చేశారు. దీనివల్ల చేలల్లో మురుగు కిందకు పారడం లేదని రైతులు చెప్పారు. రెండురోజుల క్రితం కోశ్వరదుర్గాపురం పరిసరాల్లో చెరువుల పరిసరాల్ల గట్లు కింద వేసని తూరలు తొలిగించాం. వర్షాలు తగ్గిన తర్వాత మిగిలినవి తొలిగిస్తాం. గతంలో కొందరు చేపల చెరువుల యజమానులకు నోటీసులు జారీ చేశాం. – నాగమణి, తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్

ప్రక్షాళన చేయాలి



మండలంలో వందల ఎకరాల్లో చేలు ఏటా ముంపుబారిన పడుతున్నాయి. అధికారులు పంట కాలువలు, మురుగు కాలువుల ప్రక్షాళన చేయాలి. ఈ రెండు ఆక్రమణకు గురి కావడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిపై రైతు సంఘం అనేకసార్లు ఆందోళన చేశాం. అధికారులకు వినతులు సైతం ఇచ్చాం.

– శ్రీనివాస్, రైతు నాయకుడు

క్లుప్తంగా

ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని అభినందించిన కలెక్టర్, ఎస్పీ



ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని అభినందిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఏలూరు(మెట్రో): వరద ప్రవాహ సమయంలో స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు అధికారులు, సిబ్బంది నిర్వహించిన పాత్రను కలెక్టర్ కె.వెట్రి సెల్వి, ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్, జేసీ పి.ధాత్రిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో వారు చూపిన అంకితభావాన్ని, సేవలను అభినందిస్తూ ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని ప్రతి ఒక్కరికీ జిల్లా ఎస్పీ షేక్ హ్యాండ్ ఇచ్చి అభినందించారు.

ఆహార భద్రత నియమాలు పాటించాలి

ఏలూరు(మెట్రో): ఆహార సంబంధిత వ్యాపారస్తులు తప్పనిసరిగా ఫుడ్ లైసెన్స్ తీసుకొని వ్యాపారం చేయాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి చెప్పారు. ఆహార సంబంధిత కేసులకు సంబంధించి జాయింట్ కలెక్టర్ కోర్టులో విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా 13 కేసులను విచారించారు. ఇందుకు సంబంధించి ముద్దాయిలకు రూ.1,15,510 జరిమానా విధించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆహార భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ విషయంలో నియమాలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని అలాంటి వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాట్నాలమ్మ

పెదవేగి : రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్ల ద్వారా రూ.30,600, విరాళాలు రూ.1,806, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.16,155 ఫొటోల విక్రయం ద్వారా రూ.1,555 ఆదాయం లభించగా మొత్తం రూ. 50,116 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.సతీష్ కుమార్ చెప్పారు.

అబ్రహం సేవలు ఆదర్శనీయం



రిటైర్డ్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ అబ్రహం దంపతులను సన్మానిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రిజిస్ట్రేషన్ శాఖలో ఏలూరు రేంజ్ డీఐజీగా పని చేసిన కె. అబ్రహం సేవలు ఆదర్శనీయమని రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ జాయింట్ ఐజీ–1 వి. రవికుమార్ అన్నారు. ఏలూరు రేంజ్ రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ డీఐజీగా పని చేసి శనివారం పదవీ విరమణ చేసిన అబ్రహం ఆత్మీయ అభినందన సభ ఆదివారం స్థానిక గ్రాండ్ కృష్ణ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవి కుమార్ మాట్లాడుతూ అబ్రహం రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతి రహితంగా బాధ్యతలు నిర్వహించడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రేషన్స్ శాఖ జాయింట్ ఐజీ – 2 టీ. సరోజ, వివిధరేంజ్‌ల డీఐజీలు ఎ. నాగలక్ష్మి, ఏ. రవీంద్రనాథ్, జీ. శ్రీనివాసరావు, పీ. విజయలక్ష్మి, వివిధ జిల్లాల రిజిస్ట్రార్లు రెడ్డి సత్యనారాయణ, ఎం. పార్వతి, విశ్రాంత జిల్లా రిజిస్ట్రార్ మహ్మద్ సిరాజుల్లా, లంకా వెంకటేశ్వర్లు, వీఎస్ఆర్ ప్రసాద్ సబ్ రిజిస్ట్రార్లు అడ్డాల వెంకటేశ్వర రావు, జీ. నందేశ్వర రావు, వీవీవీ ప్రసాద్, ఎం. కృష్ణ ప్రసాద్, కే. జగన్మోహన రావు, ఎం. రాజబాబు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలను తక్షణమే తగ్గించాలి

ఏలూరు (టూటౌన్): పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన దేశ వ్యాప్త పిలుపులో భాగంగా ఆదివానం సీపీఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌ఆర్‌పేట ఎన్టీఆర్ పార్కు వద్ద ప్రచార ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, బడ్జెట్లో నిధులు కేటాయించాలని, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన 100 రోజుల్లో ఆకాశంలో ఉన్న నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించి సామాన్యునికి అందుబాటులో ఉంచేలా చేస్తానని చెప్పారన్నారు. రాష్ట్రంలో 89.25 లక్షల మంది రేషన్‌కార్డులు కలిగి ఉన్నారని మరో కోటి మంది రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారని దీన్ని బట్టి ప్రజల ఆర్థిక పరిస్థితిని ప్రభుత్వాలు తెలుసుకొని అర్హులకు జనాభా లెక్కలతో సంబంధం లేకుండా రేషన్ కార్డులను అందించాలని డిమాండ్ చేశారు. నాగం అచ్యుత్, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

పక్షి ప్రేమికులకు సహకారం

ఏలూరు రూరల్: మానవత సంస్థ సభ్యులు మానేపల్లి సత్యనారాయణ పక్షి ప్రేమికులకు సహకారం అందిస్తున్నారు. అంతరించిపోతున్న పిచ్చుకతో పాటు చిలుక, పావురం తదితర పక్షుల కోసం ఉచితంగా చిరుధాన్యాలు అందిస్తున్నారు. ఇందుకోసం ఏటా ఎకరం ధాన్యం కొనుగోలు చేసి, కంకుల కట్టి పక్షి ప్రేమికులకు పంపిణీ చేస్తున్నారు. పెరుగుతున్న పట్టణీకరణ పట్టణాలు, నగరాల్లో పక్షులు కానరావడం లేదు. ఆహారం అందక పక్షుల మనుగడ కష్టంగా మారింది. దీన్ని గుర్తించి ఆయన తన ఇంటి టెరాస్‌పై పక్షులకు ఆహారం అందిస్తున్నారు. గతంలో మన పెద్దలు ఇళ్లు, గోపురాలు, ఆలయాల వద్ద పక్షులకు ఆహారంతో పాటు ఆవాసం సైతం ఏర్పాటు చేసేవారు. నేడు మళ్లీ ఆ రోజులు రావాలని, పక్షుల వల్ల మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని వాటిని కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు.



పక్షుల ప్రేమికులకు వరి కంకులు అందిస్తున్న సత్యనారాయణ

లారీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

ఏలూరు టౌన్: ఏలూరులో ఒక లారీ డ్రైవరు పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మ హత్యాయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఏలూరు తంగెళ్లమూడికి చెందిన వేల్పూరి ఉమామహేశ్వరరావు లారీ డ్రైవరుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలం క్రితం భార్య విడిపోయి వేరే చోట ఉంటోంది. పిల్లలు కూడా ఆమెతోనే ఉంటున్నారు. ఈ క్రమంలో ఉమామహేశ్వరరావు ఆదివారం తంగెళ్లమూడి నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే రోడ్డులో ఒక చర్చి సమీపంలో పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. దీన్ని గమనించిన స్థానికులు మంటలను అదుపు చేసి 108 అంబులెన్స్‌లో అతన్ని సర్వజన ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్సనందిస్తున్నారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తమ్మిలేరు వరదపై అప్రమత్తం



ఏలూరులో తమ్మిలేరు వరదపై అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ, జేసీ



పెదపాడు మండలం బొమ్మలూరు జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



వర్షపు నీటిలోనే వాహనాలపై రాకపోకలు



వరదలో చిక్కుకున్న బొమ్మలూరు గ్రామం

- అధికారులతో ఎస్పీ, జేసీ పర్యవేక్షణ
- డ్రోన్‌తో వరద ప్రాంతాల పరిశీలన

ఏలూరు టౌన్: నాగిరెడ్డిగూడెం డ్యామ్ వద్ద తమ్మిలేరు రిజర్వాయర్ ప్రమాదకరస్థాయిలో మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేయడంతో ఏలూరు నగరంలో తమ్మిలేరు వరదపై ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్, జేసీ ధాత్రీ రెడ్డి ఆదివారం రాత్రి పరిస్థితులను పర్యవేక్షించారు. తమ్మిలేరు వరదపై ముందస్తుగా ఎటువంటి చర్యలు తీసుకోవాలని విషయాలపై ఏలూరు జిల్లా ఎస్పీ, జేసీ తమ్మిలేరు వద్ద అధికారులతో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ ఎక్కడెక్కడ ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయనే విషయాలపై అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డ్రోన్ కెమెరాతో శనివారపుపేట కాజ్‌వేపై తంగెళ్లమూడి నుంచి ఎస్ఎంఆర్ నగర్ వెళ్లే రోడ్డును, తూర్పులాకులు పడమరలాకులు, వైఎస్సార్ కాలనీ ప్రాంతాల్లో పరిశీలన చేసి ఎక్కడెక్కడ వరదతో నీట మునిగే అవకాశాలు ఉన్నాయని దానిపై సమీక్షించి అధికారులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. జిల్లా ఎస్పీ, జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కేంద్రాల వద్ద ప్రజలకు కావల్సిన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రవణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, టూటౌన్ సీఐ వైవీ రమణ, త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, ఎస్సైలు ఉన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న తమ్మిలేరు


ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో రెండు పాయలుగా ప్రవహిస్తున్న తమ్మిలేరు ఉధృతంగా మారింది. నాగిరెడ్డిగూడెం డ్యామ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో ఏలూరులో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. తమ్మిలేరు వరద పెరుగుతూ ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా తంగెళ్లమూడి ప్రాంతంలో తమ్మిలేరు ఏటిగట్టు బలహీనంగా ఉంది. తూర్పు లాకుల వద్ద నిమ్మకాయల యార్డ్ బ్రిడ్జికి రెయిలింగ్ కూలిపోయి ప్రమాదకరంగా మారింది. అధికారులు సైతం దీన్ని పట్టించుకోలేదు. జనం అటువైపు వెళ్తూ వరద చూసేందుకు బ్రిడ్జి వద్దకు వెళ్తున్నారు. ఇక నగరంలో శనివారపు పేట కాజ్ వే పైకి వరద నీటి ప్రవాహం రావటంతో అక్కడ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పడమర లాకుల వద్ద పోలీసులు పహరా ఏర్పాటు చేసి ప్రజలు ఎవరూ వెళ్లకుండా చర్యలు చేపట్టారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో ఏలూరు నగర సీఐలు సత్యనారాయణ, వైవీ రమణ, కోటేశ్వర రావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



శనివారపుపేట కాజ్‌వే వద్ద పోలీస్ బందోబస్తు



నిమ్మకాయల యార్డ్ వంతెన దెబ్బతిన్న రెయిలింగ్



నిమ్మకాయల యార్డ్ వద్ద తమ్మిలేరు ప్రవాహం

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	7,10
బెండకాయలు	24	కంద	60
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	36
కాకర కాయలు	30	కీరా దోస	50
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	40	అల్లం	80-160
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	40
క్యారెట్	36	పాలకూర	10
దొండకాయలు	28	చుక్కకూర	10
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	50	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	--
ఆనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	54

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	17
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	15
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	13
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	22
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	14
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	18
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	14
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

ఏకీకృత పింఛన్ పథకం అమలును విరమించుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఏకీకృత పెన్షన్ పథకం, గ్యారెంటీ పెన్షన్ పథకం అమలును విరమించుకోవాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.రామారావు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా సబ్ కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు టి.రామారావు అధ్యక్షతన స్థానిక ఇప్టూ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోయే ఏకీకృత పెన్షన్ పథకం వల్ల ఉద్యోగులకు ఎటువంటి ప్రయోజనం లేదని సీపీఎస్.జీపీఎస్‌లకు ఈ పథకానికి తేడా ఏమీ లేదన్నారు. ప్రభుత్వ వాటాను 14 శాతం నుంచి 18.5 శాతానికి పెంచి కార్పొరేట్ శక్తులకు మరింత మేలు చేకూర్చడం జరుగుతుందన్నారు. ఇటువంటి పథకాలను ఏపీటీఎఫ్ ఆమోదించబోదని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రెడ్డి దొర మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసిన జీవో నం.117ను రద్దు చేయకుండా పని సర్దుబాటు ప్రక్రియ చేపట్టడం సరికాదన్నారు. దీని వల్ల మిగులు ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య పెరిగిందన్నారు. తక్షణమే 117 జీవోను రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులను విద్యాశాఖలో విలీనం చేసి రెండేళ్లు గడుస్తున్నా నేటికీ వారికి ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కల్పించకపోవడం శోచనీయమన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కల్పించాలన్నారు. అన్ని ప్రభుత్వ యాజమాన్యాల లోని ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, ప్రభుత్వ పాఠశాలల్లోని పండిట్, పీఈటీ పోస్టులను ఉన్నతీకరించి 4 ఏళ్లు గడిచినప్పటికీ నేటికీ ఐటీడీఏ యాజమాన్యంలోని పాఠశాలల్లో పండిట్, పీఈటీ పోస్టులను ఉన్నతీకరించకపోవడం బాధాకరమన్నారు. ఐటీడీఏ పరిధిలో ఖాళీగా ఉన్న డిప్యూటీ వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు జేఎస్ శాస్త్రి, కేఎస్ రమాదేవి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సబ్ కమిటీ సభ్యులు సీనియర్ నాయకులు కె.ప్రకాష్, పి.జగదీష్, ఎస్.దొరబాబు, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు టి.రామారావు

టీడీపీలో చేరిన కార్పొరేటర్లు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని 14 మంది కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యురాలు ఆదివారం ఎమ్మెల్యే బడేటి చంటి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరంతా వైఎస్సార్‌సీపీకి తమ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు.